కసి

టెంపోరావ్

ట్రాడర్స్‌గేటు హోటల్ 30 నంబరు గదిలో కూర్చుని స్కాచ్ విస్కీ ఒంటరిగా అతను సేవిస్తున్నాడు. గదిలో ఫ్లోరసెంట్ లైట్ ప్రకాశవంతంగా వెలుగుతోంది. టైమ్ చూశాడు. పది కావస్తోంది.

టెలిఫోన్ మ్రోగింది. అతడు రిసీవర్ని అందుకున్నాడు.

"పవన్‌కుమార్," అన్నాడతడు.

"హోటల్ రిసెప్షన్ సార్! మీ కోసం ఒక యువతి వచ్చింది. పేరు మాలతి. పైకి పంపమంటారా?"

"వెంటనే పంపండి," అని అతను రిసీవర్ని పెట్టేశాడు.

సిగరెట్ వెలిగించాడు. పొగ వదులుతూ సోఫాలోంచి లేచి తలుపు లాక్ తీసివుంచాడతను.

కాసేపట్లో ఎవరో తలుపును తట్టారు. "కమిన్," అన్నాడతను.

ఆమె లోపలకు వచ్చింది. అతడు తలుపు మూసి లాక్ చేశాడు.

నిషా యెక్కిన కళ్ళతో క్షణకాలం ఆమెవంక చూశాడు. తను చూసిన ఫోటో కంటె సజీవంగా తన ముందు నిలబడిన ఆమె చాలా అందంగా వుంది.

నీలంరంగు ప్రింటెడ్ సిల్కు చీర, మాచింగ్ జాకెట్. కాళ్ళకు గ్రీన్ స్లిప్పర్స్. నుదురుమీద అదే రంగు బొట్టు. పొడుగాటి జడ. ఆమె బొడ్డు కనిపిస్తోంది. అతడి చూపు పైకి వెళ్ళింది.

ఆమె కళ్ళు మెరుస్తున్నాయి, ఆమె వయసు యిరవై లోపున వుంటుందేమో!

"హలో!" అన్నాడు.

"హలో," అందామె.

"ఎలా వుంది నా గదిలో?"

"ఫైన్," అందామె.

అతడామెను సోఫాలో కూర్చోమన్నాడు.

"విస్కీ తాగుతావా?"

"కొంచెం," అందామె.

మరో గ్లాసులో అతను విస్కీ పోసి, ఐస్ క్యూబ్స్ వేసి కొద్దిగా సోడా కలిపాడు. గ్లాసును ఆమెకు అందించాడు.

"చియర్స్!" అని యిద్దరూ తాగసాగారు.

గ్లాసులో మళ్ళీ విస్కీ పోసుకుని, కొంచెం తాగి అతడామెవంక చూశాడు. ఆమె కిలకిల నవ్వింది.

"నువ్వు తరచు యీ హోటల్ కి వస్తూంటావా?"

"ఇదే మొదటిసారి రావడం," అందామె.

"రియల్లీ?"

ఆమె మాట్లాడలేదు. గ్లాసులోని విస్కీని గడగడ తాగేసింది. అతను మళ్ళా పోయబోయాడు.

"ప్లీస్, వద్దు!" అందామె.

టెలిఫోన్ మ్రోగింది. అతడు రిసీవర్ని తీసుకున్నాడు.

"హాలో, పవన్."

"రాక్జీ!" అందో కంఠం అటువైపు నుంచి.

"రామ్జీ, ఐయామ్ యిన్ హెవన్!"

"ఎప్పటినుంచి?"

"తొమ్మిది నుంచి!"

"మైడియర్ ఫ్రెండ్, పానకంలో పుడకలా నీ హెవన్లోకి నేను రావడం యిష్టంలేదు. రేపు ఫోన్ చేస్తాను."

అటువైపున రిసీవర్ పెట్టివేయబడింది. ఏర్ కండిషండ్ గదిలో చల్లగా వుంది. అతడు తూల్తూ ఎటాచ్డ్ బాత్ రూమ్వైపు వెళ్ళాడు. పడిపోతాడేమో అని భయపడి ఆమె అతడిని పట్టుకొంది.

"యూ ఆర్ నైస్ గర్ల్!" అన్నాడతను.

అతడు బాత్ రూమ్లోకి వెళ్ళి తిరిగొచ్చాడు. ఆమె సోఫాలో కూర్చుని ఆలోచిస్తోంది. తనకోసం 500 అతడు యెందుకు చెల్లించాడు? తను వచ్చినా అతడింకా తాగుతూనే వున్నాడు. మరికొంచెం తాగితే అతను ఒళ్ళు తెలియకుండా నిద్రపోతాడు.

టెలిఫోన్ మ్రోగడం విని ఆమె తృళ్ళిపడింది.

"హాలో, పవన్," అన్నాడతను.

"డిన్నర్, సార్?" అ పక్క నుంచి అడిగాడు. హోటల్ గుమాస్తా.

అతడు ఆమెవైపు చూశాడు.

"డిన్నర్ యిక్కడికి తెమ్మంటాను!"

"అలాగే చెయ్యండి."

అతడు చెప్పి రిసీవర్ పెట్టేశాడు. క్షణకాలం ఆమె వైపు నవ్వుతూ చూశాను.

"నీ పేరు మాలతిగా?" అడిగాడు.

ఆమె తలాడించింది.

"మంచి పేరు. నువ్వు నాకు చాలా నచ్చావు. నేను నీకు నచ్చానా?"

"ఎందుకదంతా?" అడిగిందామె, అతడివైపు చూస్తూ.

అతడు పొడుగ్గా, సన్నగా వున్నాడు. తలమీది జుత్తు సగం పైన రాలిపోయింది. వయస్సు నలభై పైన వుండొచ్చు. ఖరీదయిన పాంటు, స్లాక్ ధరించాడు. చేతికి అందమైన సీకో వాచ్ వుంది. "కంహియర్!" అన్నాడతను.

ఆమె అతడి ముందుకు వెళ్ళింది. తనవైపు ఆమెను తటాలున లాగాడు. ఆమె అతడి ఒళ్ళో పడింది. అతడి చేతులు ఆమెను బలంగా చుట్టేశాయి. ఆమె మెడమీద ముద్దెట్టుకున్నాడతను.

ఎవరో తలుపును తట్టారు.

"నే వెళ్ళి చూస్తాను," అని వెళ్ళి లాక్ తీసిందామె.

హోటల్ బేరర్ చక్రాల టేబుల్ను తోసుకుంటూ లోపలకు వచ్చాడు. ఒకచోట టేబుల్ను వుంచి రెండు వైపులా కుర్చీలు అమర్చాడు.

"కమ్ యిన్ ది మోర్నింగ్!" అన్నాడతను.

"యస్సార్," అని అతడు వెళ్ళిపోయాడు.

ఆమె తలుపుమూసి, లాక్ చేసి, మెల్లిగా వెళ్ళి సోఫాలో కూర్చుంది.

అతడు గ్లాసులో మళ్ళా విస్కీ పోసుకున్నాడు. ఆమె వూరుకొంది. అతడు ఎక్కువ తాగితే తనకు నష్టంలేదు. సుఖంగా రాత్రి పడుకుని పొద్దుట ఆరింటికి వెళ్ళి పోవచ్చు!

ఎనిమిది గంటలపాటు తను అతడితో వుండాలి! అంతే!

నిమిషాలు గడుస్తున్నాయి. డిన్నర్ ముగిస్తే తర్వాత నిద్రపోవచ్చు. ఆలోచిస్తూ అతడి వంక చూసింది.

"భోజనం చేద్దామా?" అని అడిగింది.

"పారిస్‌లో పన్నెండు దాటాక తింటారు" అన్నాడతను.

అతడి మాటలు ముద్దగా వెలువడుతున్నాయి.

"మనం ఇప్పుడు పారిస్‌లో లేం. మద్రాసులో వున్నాం" అందామె నవ్వుతూ.

"అవును, మర్చిపోయాను. లెటస్ యీట్!" అని లేచాడతను.

కింద పడబోయాడు. పట్టుకుని తీసుకువెళ్ళి ఆమె కుర్చీలో కూర్చోబెట్టింది. రకరకాల పదార్థాలు వున్నాయి. అతడు తినలేక తింటూ, చిలిపిగా నవ్వుతూ కూర్చున్నాడు. ఆమె ఆకలితో తిని చేయి కడుక్కుంది.

అగాడిని తీసుకెళ్ళి పరుపుమీద పడుకోబెట్టింది. స్విచ్ చీకటిలో తడుముకుంటూ పరుపు వైపు నడిచింది. పరుపు మీత పడుకొని పక్కనున్న స్విచ్ నొక్కింది. జీరో వాట్ బల్బు డిమ్‌గా వెలిగింది.

పక్క పడుకున్న అతడివైపు చూసిందామె. కళ్ళు మూసుకుని అతడు నిద్రపోతున్నాడు. అంతగా తాగిన వాళ్ళు పొద్దుటదాకా లేవరు. ఆమె ఆలోచిస్తూ వుండి

పోయింది. తను వెళ్ళిపోతే అతడు గుర్తించడు!

పొద్దుట ఏ టైములో అతడు లేస్తాడు. ఆరింటికి తను వెళ్ళిపోయిందని అతడనుకుంటాడు. తను ఇప్పుడే పోవచ్చు!

ఆమె టైమ్ చూసింది. ఇంకా పన్నెండు కాలేదు. ఆమె లేచింది. తన హేండ్ బాగ్ తీసుకుని, లాక్ తీసి, బయటకు నడిచి తలుపు దగ్గరగా మూసింది. నడవలో యెవ్వరూ లేరు. నడవమ్మట వేగంగా నడిచి ఆమె వెళ్ళిపోయింది.

కొద్దిగా తెరచిన తలుపు వెనకనుంచి 20 నంబరు గదిలో వుండే వ్యక్తి ఆమె వెళ్ళడం మౌనంగా గమనించాడు.

పది ప్రాంతంలో ఆమె ఆ గదిలోకి వెళ్ళడం అతడు చూశాడు. ఇంత రాత్రి వేళ ఆమె వెళ్ళిపోతోంది!

అతను మెల్లిగా నడవలో కొచ్చాడు. యెదురుగా వున్న 30 గదివైపు కదిలాడు. తలుపును తోశాడు. తెరుచుకుంది. గుమ్మందాటి నిలబడి గది నలువైపులా చూశాడు.

జీరో వాట్ బల్బు వెలుగుతోంది. అతడు బయటకొచ్చి తలుపు మూసి లాక్ చేశాడు. మెల్లిగా 30 నంబరు గదిలోకెళ్ళి, తలుపుమూసి లాక్ చేసి, స్విచ్ నొక్కాడు.

ఫ్లోరసెంట్ లైట్ వెల్గింది. చక్రాల టేబుల్ మీద ఎన్నో పదార్థాలు వున్నాయి. వాళ్ళు తినలేదేమో!

అతడు వెళ్ళి సోఫాలో కూర్చున్నాడు. స్కాచ్ విస్కీ బ్లాక్ డాగ్ బాటిల్ వైపు చూశాడు. అందులో కొద్దిగా విస్కీ వుంది. టీపాయిమీద రెండు గ్లాసు

లువాన్నాయి.

ఇద్దరూ తాగేరన్నమాట! అతడు లోలోపల నవ్వుకున్నాడు.

ఒక గ్లాసులో విస్కీపోసి, పక్కనే కూల్ బాక్స్‌లో వున్న ఐస్ క్యూబ్స్ పడేశాడతను. సిగరెట్ పొగపీల్చి, వదుల్తూ, విస్కీ తాగుతూ కూర్చున్నాడతను.

2

విస్కీబాటిల్ ఖాళీ అయింది. అతడు సోఫాలోంచి లేచాడు. పరుపుమీద నిద్రపోతున్న వ్యక్తివైపు చూశాడు. ధనవంతుడిలా అగుపిస్తున్నాడతను.

అతడు వెనక్కి తిరిగాడు—వెతుకుతూ గదినలువైపులా తిరిగాడు. ఒక టేబుల్‌మీద లెదర్ పెట్టె, పక్కనే బ్రీఫ్‌కేసు వున్నాయి. వాటిని తెరిచిచూశాడు. లెదర్ బాక్స్‌లో బట్టలుమాత్రం వున్నాయి. కాని బ్రీఫ్‌కేసులో వందరూపాయల నోట్లు కట్టలు కట్టలుగా వున్నాయి.

ఒక బీరువా ఎడంవైపు వుంది. అక్కడకు వెళ్ళి అతను తెర్చిచూశాడు. రెండు సూట్లు, కొన్ని షర్టులు, స్లాక్స్ హేంగర్స్‌నుంచి వేళ్ళాడుతున్నాయి.

బీరువాలో రెండు స్కాచ్ విస్కీ బాటిల్స్ వున్నాయి. అతను ఒక బాటిల్ను తెరిచి, మెల్లిగా వెళ్ళి టీపాయిమీద వుంచాడు. అక్కడున్న ఖాళీ బాటిల్ను గోడవారగా వున్న టేబుల్‌కింద పెట్టాడు.

తిరిగొచ్చి అతడు సోఫాలో కూర్చున్నాడు. గ్లాసులో విస్కీపోసి, ఐస్ క్యూబ్స్ వేసుకుని మెల్లిగా తాగుతూ కూర్చున్నాడు.

అతడి మెదడులో ఆలోచనలు సాగుతున్నాయి.

లాడర్స్ గేటు హోటల్ చాలా పెద్దది. రాత్రిప్పు గదుల్లో వున్న వాళ్ళను యెవ్వరూ డిస్టర్బు చెయ్యరు!

బాటిల్లోని విస్కీని సగంవరకూ అతడు తాగేశాడు. కాని అతడికంతగా నిషాలేదు.

నిమిషాలు గడుస్తున్నాయి. టైమ్ రెండు దాటింది. పరుపుమీద పడుకున్న పవన్ కుమార్ అమాంతంగా లేచి కూర్చున్నాడు.

సోఫాలో కూర్చున్న తను లేచి అతడిముందుకు వెళ్ళాడు. అతడివైపు సూటిగా చూశాడు.

"ఎవరు నువ్వు? నా గదిలో ఏం చేస్తున్నావ్?" ప్రశ్నించాడు పవన్.

"మిస్టర్, నోరు మూసుకుని కూర్చో! యెక్కువగా మాట్లాడితే పళ్ళూడ్తాయి" అన్నాడతను.

పవన్ కుమార్ గదినలువైపులా చూశాడు. తన యెదురుగా నిలబడినవాడు గూండాలా వున్నాడు. తను ధైర్యంగా ప్రవర్తిస్తే అతడు భయపడి పారిపోవచ్చు!

పవన్ పరుపుమీదనుంచి అటువైపుకు చూశాడు. పరుపు కిందున్న పిస్టల్ని చేతిలోకి తీసుకున్నాడు.

పిస్టల్ని అతడివైపు గురిపెట్టాడు.

"యూ బాస్టర్డ్ యిప్పుడు చెప్పు! యెవరు నువ్వు?" పవన్ అడిగాడు.

"నా పేరు నీకు తెలియదు. నేను చెప్పినా నీకు ఉపయోగపడదు" అన్నాడతను.

"ఈ గదిలో ఒక యువతి వుండాలి — ఆమె ఏమైంది?"

"బాత్ రూంలో వుంది!"

పవన్ కుమార్ వెనకనున్న బాత్ రూమ్ వైపు

చటుక్కున తిరిగాడు. పరుపుమీదున్న తలగడను అమాంతంగా అతడి చేతివైపు విసిరాడతను.

పిస్టల్ కిందపడింది. అతడు పవన్ వైపు పరుపుమీద నుంచి దూకాడు. వంగి కిందపడిన పిస్టల్ని తీయబోతున్న పవన్ చేతిని గట్టిగా పట్టుకుని, బలంగా లాగాడు.

పిస్టల్ దూరంలో వుంది. పవన్ భయంతో అతడి వైపు చూశాడు.

"ఆ పిల్ల నిన్ను నా గదిలోకి రానిచ్చి వుండాలి. ఆమె చీట్!" అన్నాడు పవన్.

"ఆమె చీట్ కాదు. తలుపు తెర్చి ఆమె నన్ను యిక్కడకు రమ్మనలేదు. ఆమె వెళ్ళిపోయింది. తలుపు తెర్చి వుంది. నా అంతట నేనే వచ్చాను" అన్నాడతను.

"అయిందేదో అయింది. నీకేం కావాలి? డబ్బా?"

"ఈ లోకంలో మనుషులకు డబ్బు తప్ప మరేదీ అక్కరలేదని నువ్వు భావిస్తున్నావా?" బులెట్లా ప్రశ్నించాడతను.

"లోకంలో డబ్బుకంటె విలువైనది ఏముంది?" అడిగాడు పవన్కుమార్.

అతడు పవన్ వంక కోపంగా చూశాడు.

"మా ఊళ్ళో ఒకతను నీలాగే డబ్బే సర్వస్వం అనుకునేవాడు. అది నిజంకాదని అతడు ఆలస్యంగా తెల్సుకున్నాడు, ప్రాణంపోయేముందు!"

పవన్ మాట్లాడలేదు. ఏం చెప్పాలా అని చూస్తున్నాడు.

"నీ గదికి రావడానికి ఆ యువతికి యెంతిచ్చావు?"

"ఐదువందలు."

"నీ చేతిలో డబ్బుంది. ఆ డబ్బుతో వస్తువులను

కొన్నట్లు ఆడవాళ్ళను నువ్వు కొంటూ వుంటావు. ధన మదంతో విర్రవీగుతూ అది తప్పని నువ్వీ జీవితంలో నేర్చుకోవు!"

పవన్ మెదడు వేగంగా పనిచేయసాగింది. వీడెవడో గాని ధనవంతులమీద పగబట్టిన వ్యక్తిలా వున్నాడు. అతడిని తృప్తిపర్చి తన ప్రాణాన్ని కాపాడుకోవాలి!

పవన్ పెదవులు వాయించుకున్నాడు. "నువ్వు చెప్పింది నిజం! నాకు గొప్ప సత్యాన్ని నువ్వు చూపించావు. ఈ లోకంలో ముఖ్యమైనది డబ్బు కాదు!" అన్నాడు పవన్.

అతడు విచిత్రంగా నవ్వాడు.

"నన్ను చూసి భయపడి నీ నమ్మకాన్ని మార్చుకున్నావా?"

"భయంవలన కాదు. నీ మాటల్లోని నిజాన్ని నేను గ్రహించాను. ఈ క్షణంలో నాలో వచ్చిన మార్పు ఈ జీవితంలో పోదు!"

"నా కత్తికి బలైపోవలసిన వ్యక్తిని అతడిలో సంభవించిన పరివర్తన కాపాడింది!" అన్నాడతను పిశాచంలా.

సమీపంలో వున్న టేబుల్ దగ్గరకు అతను నడిచాడు. బ్రీఫ్ కేసును చేతిలోకి తీసుకున్నాడు.

"ఇందులో చాలా డబ్బుంది. తిండిలేక మాడేవాళ్ళకు ఈ డబ్బును నేను ఇచ్చేస్తాను!" అన్నాడతను.

"తప్పక యిచ్చేయి! నేను చాలా ఆనందిస్తాను!" అన్నాడు పవన్.

"మిష్టర్, నేను వెళ్తున్నాను. నా గురించి నువ్వు యెవరికేనా ఫోన్ చేయొచ్చు! అలా చేస్తే నేను మళ్ళా ఇక్కడకు వస్తాను."

"నేనెవరికీ ఫోన్ చెయ్యను. పడుకుంటాను" అన్నాడు పవన్.

"బయట నిలబడి గంటదాకా నిన్ను గమనిస్తూ వుంటాను. నువ్వు రిసీవర్ ఎత్తితే నేను గదిలోకి వస్తాను."

"నేనేమీ చెయ్యను. మనస్ఫూర్తిగా ఆ డబ్బు నీకిస్తున్నాను."

అతడు బయటకు నడిచాడు. పవన్ తలుపు మూసి లాక్ చేశాడు. సోఫాలో కూర్చుని గ్లాసులో విస్కీ పోసుకుని, సోడా కలిపి గడగడ తాగేశాడు.

ఇప్పుడతనికి ధైర్యం వచ్చింది. వెంటనే ఫోన్ చేసి హోటల్ రిసెప్షన్‌తో మాట్లాడాలి. తన బ్రీఫ్ కేసు పట్టుకుపోయిన అతడికోసం వెతకమనాలి!

పవన్ రిసీవర్ ఎత్తాడు. యెవ్వరూ పలకలేదు. అటు వైపున నిశ్శబ్దంగా వుంది. అతడు టెలిఫోన్ వైర్లను కత్తిరించాడేమో!

అరగంట దాటింది. అతడు నిజంగా గంటవరకూ బయట కాపలా వుంటాడా? ఈ పాటికి ఆ డబ్బు తీసుకుని అతడు పారిపోయి వుంటాడు!

పవన్ టైమ్ చూశాడు. మూడు దాటింది. తలుపు తెర్చి కిందకు వెళ్ళి రిసెప్షన్‌లో చెప్పడం మంచిదేమో!

పవన్ లాక్ తీసి తలుపు తెర్చాడు. అతడు వులిక్కి పడ్డాడు. బయట నిలబడిన అతడు అమాంతంగా లోపలి కొచ్చి, తలుపు మూసి, లాక్ చేశాడు.

పవన్ వైపు అతడు పిశాచంలా చూశాడు.

"రాస్కెల్ నన్ను మోసం చెయ్యాలని చూశావా?" అర్చాడతను.

పవన్ నోటమ్మట మాట పెగల్లేదు. స్తంభించిపోయి

నట్లు అతడు నిలబడిపోయాడు.

కోటు జేబులోంచి అతడు కత్తిని బయటకు లాగి బటన్ నొక్కాడు. పదునైన కత్తి బయటకు జొచ్చుకొచ్చింది.

అటువైన టకటక అంతా జరిగిపోయింది. పవన్ పరుపుమీద పడ్డాడు. కత్తి అతడిలోకి దిగి, పైకి లేచి, మళ్ళా దిగుతోంది. యెడంచేత్తో అతడి నోరును నొక్కేశాడతను.

పవన్ రక్తం మడుగులో పడున్నాడు. ఒంటినిండా కత్తిపోట్లు!

అతడు సోఫాలో కూర్చుని గ్లాసులో విస్కీ పోసుకున్నాడు. ఐస్ క్యూబ్స్ గ్లాసులో వేశాడు. గడగడ విస్కీ తాగేశాడు. గ్లాసునీ' బుడ్డినీ రుమాల్తో తుడిచేశాడు.

అతడు సోఫాలోంచి లేచాడు. పరుపుమీద పడున్న పవన్ వైపు మౌనంగా చూశాడు. దుప్పటినిండా రక్తం!

అతడు టైమ్చూశాడు.

మూడున్నర కావస్తోంది. అతడు బయటకు నడిచాడు. తలుపు దగ్గరగా మూశాడు. యెదురుగా వున్న తన గదిలోకి వెళ్ళాడు. బాగ్, బ్రీఫ్ కేసు పట్టుకుని అతడు కిందకు వెళ్ళాడు.

రిసెపన్ గుమస్తా కునికిపాట్లు పడుతున్నాడు. అతడు హోటల్ బయటకు వెళ్ళాడు. టాక్సీలో కూర్చుని తలుపు మూశాడు.

డ్రయివర్ ముందు సీటుమీద నిద్రపోతున్నాడు. అతడిని తట్టిలేపాడు.

“ఎక్కడికెళ్ళాలి?” అన్నాడు డ్రయివర్.

"మాంట్ రోడ్డు" అన్నాడతను.

టాక్సీ కదిలింది. మాంట్ రోడ్డులో బుహారీ హోటల్ ముందు అతడు దిగాడు. మీటర్ చూసి డబ్బు చెల్లించాడు. డ్రయివర్ కి ఒక రూపాయి ఇచ్చాడు.

రోడ్డు దీపాలు వెలుగుతున్నాయి. కాని ఆ సమయంలో జనసంచారం ఎక్కువ లేదు. అతడు రోడ్డమ్మట నడిచి వెళ్ళిపోయాడు.

3

గాఢ నిద్రలోంచి లేచాను. టెలిఫోన్ మ్రోగుతోంది. ప్రక్కనున్న రిసీవర్ని తీశాను.

"హలో, పరశురామ్," అన్నాను.

"బ్రదర్, నాయర్!" అందో బొంగురు కంఠం.

"నాయర్ భాయ్, ఏమిటి సంగతి?"

"బ్రదర్, వెంటనే లాడర్స్ గేటు హోటల్ కి రా! అక్కడొక హత్య జరిగింది. నేను వెళ్తున్నాను."

"ఆల్ రైట్, వస్తాను" అని రిసీవర్ని పెట్టేశాను.

టైం చూశాను. ఆరు దాటింది. అప్పుడే వెలుతురు వస్తోంది. నా పక్కన పడుకున్న పార్వతి యింకా లేవలేదు. ఆమె ఏడు దాకా లేవదు.

బాత్ రూంలోకి వెళ్ళి పేస్టుతో పళ్ళు తోముకుని బయటికొచ్చాను. దుస్తులు ధరించి కిందకు దిగాను.

కృష్ణయ్య పరుగెత్తూ నా దగ్గర కొచ్చాడు. "సార్, కాఫీ తాగి వెళ్ళండి," అన్నాడతను.

అతడిచ్చిన కాఫీని నిలబడే తాగాను. కాఫీ చాలా బాగుంది. ఇంకా తాగాలనిపించింది. నా ఆలోచనల్ని కృష్ణయ్య గ్రహించినట్లు వున్నాడు. మరో కప్పు కాఫీ తెచ్చి నా కిచ్చాడు. అది తాగి హుషారుగా బయటకు

నడిచాను.

డ్రాడ్జి కారును శరవేగంగా లాడర్స్‌గేటు హోటలు వైపు పోనిచ్చాను.

లాడర్స్‌గేటు హోటల్ కాంపౌండులో కారాపి దిగాను. నా కారు ముందు పోలీస్ జీప్ వుంది. అక్కడ నిలబడ్డ ఒక కానిస్టేబులు నన్ను చూసి శల్యూట్ చేశాడు.

హోటల్ వైపు నడుస్తూ నలువైపులా చూశాను. ఫైవ్ స్టార్ హోటలు. సూటులో వున్న ఒక వ్యక్తి నా వైపు గబగబా వచ్చాడు.

"పరశురామ్‌గారూ, మీరు వస్తున్నారని ఇన్‌స్పెక్టర్ నాయర్ చెప్పారు. నా పేరు ఆర్నాద్. నేనీ హోటలు మేనేజర్ని," అన్నాడతను.

సిగరెట్ పీలుస్తూ అతడి పక్కనే వెళ్ళాను. విశాలమైన హోటల్ ముందు గదిలోంచి కదులుతున్నాం.

"పరశురామ్‌గారూ, ఈ మర్డర్ ఎలా జరిగిందో గాని నాకు గాభరాగా వుంది. దీని మూలంగా మా బిజినెస్ దెబ్బతినొచ్చు."

అతడివైపు నవ్వుతూ చూశాను.

"డోంట్ బాదర్! ఇటువంటి పెద్ద హోటళ్ళలో అప్పుడప్పుడు యిటువంటివి జరుగుతూనే వుంటాయి," అన్నాను.

లిఫ్ట్‌లో పైకి వెళ్ళాం. మూడో అంతస్థులో దిగాం. నడవలో పోలీసులు పచార్లు చేస్తున్నారు.

ఇన్‌స్పెక్టర్ నాయర్ నావైపు వచ్చి నవ్వుతూ కరచాలనం చేశాడు. మేనేజర్ ఆర్నాద్ నా ప్రక్కనే వున్నాడు.

"బ్రదర్, హతుడి పేరు పవన్‌కుమార్. అతడి వూరు

కలకత్తా. వారం రోజులయింది అతడు యీ హోటల్లో గది తీసుకొని." అన్నాడు నాయర్.

"ఆయన ఎప్పు డొచ్చినా యిక్కడే వుంటారు" అన్నాడు మేనేజర్ ఆర్నాద్.

30 నంబర్ గదిలోకి ఇన్ స్పెక్టర్ నాయర్ తో వెళ్ళాను. ఆర్నాద్ నడవలో వుండిపోయాడు.

ఏర్ కండిషండ్ గది. గోడకు అమర్చిన జీరో వాట్ బల్బు వెలుగుతోంది. పెద్ద మంచంమీద ఫోమ్ బెడ్. పరుపు మీద అతడు వెల్లకిలా పడున్నాడు. మెడమీద, గుండె ప్రాంతంలో, కడుపుమీద కత్తిపోట్లు!

ఎవరో విపరీతమైన కసితో పొడిచి, పొడిచి యితడిని చంపివుండాలి!

"ఘోరంగా హత్య చేయబడ్డాడు," అన్నాడు ఇన్ స్పెక్టర్.

గది నలువైపులా తిరిగాను. రెండు సోఫాలు,టీపాయి వున్నాయి. టీపాయిమీద స్కాచ్ విస్కీ బాటిల్, రెండు గ్లాసులు వున్నాయి. పక్కనే కూల్ బాక్స్. తెరచి చూశాను. అందులో ఐస్ లేదు. అడుగున కొద్దిగా నీళ్ళు న్నాయి.

టేబుల్ దగ్గరకు వెళ్ళాను. లెదర్ బాక్స్, కొన్ని ఫైల్సు వున్నాయి. కిందకు చూశాను. గోడవారగా ఒక ఖాళీ విస్కీబాటిల్ వుంది. పవన్ కుమార్ రోజూ తాగుతూ వుండాలి.

వెనక్కు తిరిగాను . ఇన్ స్పెక్టర్ నాయర్ నావైపు చూస్తున్నాడు.

"బ్రదర్, గది తలుపు చూశావా?"

తలుపు దగ్గరకు వెళ్ళాను. తలుపుకు గాడ్ రెజ్ లాక్

అమర్చబడి వుంది. తాళంచెవి బయటకు కనిపిస్తోంది.

ఆలోచిస్తూ సిగరెట్ వెలిగించాను. హంతకుడు గది లోకి యెలా వచ్చాడు? ఇతడు తలుపు తెర్చి రానిచ్చాడా? రాత్రివేళ తెలిసిన వ్యక్తి అయితే గాని ఎవ్వరూ తలుపు తెరవరు!

నడవలోకి వెళ్ళాను. మేనేజర్ ఆర్నాద్ వైపు నవ్వుతూ చూశాను.

"మనం మాట్లాడాలి!" అన్నాను.

ఇద్దరం నడవమ్మట నడిచాం. పదిహేనో నెంబరు గది తాళం తెరిచి అతడు లోపలకు వెళ్ళాడు. వెనుకనే నేనూ నడిచాను.

అతడు ఏర్ కండిషన్డ్ ఆన్ చేశాడు.

ఇద్దరం సోఫాల్లో ఎదురెదురుగా కూర్చున్నాం. అతడి వంక సూటిగా చూశాను.

"పవన్ కుమార్ ఎప్పుడూ యీ హోటల్లోనే వుంటూ వుంటాడని మీరు అన్నారు. అతడిని గురించి మీకు తెలిసినదంతా చెప్పండి." అన్నాను.

"ఆయన పెద్ద బిజినెస్ మన్ సార్. ఆయన కంపెనీ బ్రాంచి యీ పట్నంలో వుంది. నిప్పన్ ఏజన్సీస్!"

"నిన్న రాత్రి ఆయన గదికి ఎవరేనా వెళ్ళడం మీరు చూశారా?"

"నేను చూడలేదు. కాని డిన్నర్ యిద్దర్కి మా మనిషి గదికి తీసుకువెళ్ళాడు. ఒక యువతి ఆయనతో వుందని నాకు తెలుసు. ఆయన కొంచెం రొమాంటిక్ టైప్!"

"ఆమె అతడి ఫ్రెండా?"

"అదంతా నాకు తెలియదు."

"డబ్బిచ్చి ఆమెను తన గదికి రప్పించుకున్నాడా?"

"చెప్పలేను."

"మిస్టర్ ఆర్నాద్, యిక్కడ జరుగుతున్నదంతా మీకు తెలిసే వుంటుంది. ఈ హత్య ఎలా జరిగిందో కను క్కోవాలంటే మీరు నిజం చెప్పాలి. మీరు నాకు చెప్పి నది రహస్యంగా వుంచుతాను" అన్నాను.

కొంతసేపు అతడు మౌనం దాల్చాడు. జేబులోంచి సిగరెట్ పాకెట్ తీసి, ఒక సిగరెట్ వెలిగించాడు.

"పరశురామ్‌గారూ, ధనవంతులకు ఎన్నో వ్యసనాలు వుంటాయి. అటువంటివాళ్ళే మా హోటల్లో గది తీసుకుని వుంటారు. రాజన్ అనే సప్లయిర్ యీ హోటల్లో తిరు గుతూ వుంటాడు. అతడు నిన్న రాత్రి ఒకమ్మాయిని పవన్‌కుమార్ గదికి పంపాడు."

"రాజన్ ఎక్కడుంటాడు?"

"అనేక హోటల్సులో అతడు తిరుగుతూ వుంటాడు. అతడు దొరకగానే మిమ్మల్ని కల్సుకోమని చెప్తాను."

"రాజన్, ఆ యువతి నాకు కావాలి."

"రాజన్‌తో చెప్పి ఆమెను రప్పిస్తాను."

"చాలా థాంక్స్" అని సోఫాలోంచి లేచాను.

ఆలోచిస్తూ సిగరెట్ వెలిగించాను.

"ఈ గది ఖాళీగా వుందా?" అడిగాను.

"పరశురామ్‌గారూ, మీరు తాత్కాలికంగా యీ గదిని వాడుకోవచ్చు" అన్నాడతను.

మేనేజర్ ఆర్నాద్ బయటకు వెళ్ళిపోయాడు.

టెలిఫోన్ దగ్గరకు వెళ్ళి రిసీవర్ ఎత్తాను.

"హోటల్ లాడర్స్‌గేట్ ప్లీస్," అందో స్త్రీ కంఠం.

"నిప్పన్ ఏజన్సీస్‌కు ఫోన్ చేసి కనెక్షన్ యివ్వండి." అన్నాను.

ఆమె నంబరు అడగలేదు. పవన్‌కుమార్ ఎన్నిసార్లో తన బ్రాంచికి ఫోన్ చేస్తూ వుండివుండాలి!

టైమ్ చూశాను. ఎనిమిది దాటింది.

"హలో, నిప్పన్ ఏజన్సీస్."

"ఎవరు మాట్లాడుతూంది?"

"మేనేజర్ వినాయక్, సార్."

"మిస్టర్ వినాయక్, నిన్నరాత్రి మీ బాస్ పవన్ కుమార్‌ని యెవరో లాడర్స్‌గేటు హోటల్సులో హత మార్చారు...."

వినాయక్ గట్టిగా అర్చాడు.

"వాడే అయివుండాలి సార్!"

"ఎవరు?"

"ఎవరెస్టు గార్మెంట్స్ అధిపతి ఆదిమూలం. నిన్న ఆఫీసులో అతడికీ, మా బాస్‌కీ పెద్ద పోట్లాట అయింది."

"దేన్ని గురించి?"

"ఆరు నెలల క్రితం ఆదిమూలం మాకు లక్ష రూపాయలు అడ్వాన్సుగా యిచ్చాడు. ఒక జపాన్ మిషన్ మేం అతడికి యివ్వాలి. మిషన్ వచ్చాక మిగిలిన డబ్బు అతడు యిస్తానన్నాడు. కాని ఆ మిషన్ యింతవరకూ మేం అతడికి యివ్వలేకపోయాం. మూడు నెలల్లో యిస్తానని మిషన్ యివ్వకుండా ఆరు నెలలు గడిపేశారని అతడు మాట్లాడాడు. పవన్‌కుమార్ ఎంత చెప్పినా అతడు వినలేదు. చివరికి అతని అడ్వాన్సు వాపస్ చేస్తానని పవన్ కుమార్ అన్నారు. అతడు చెక్ వద్దన్నాడు. రేపు

వస్తాను కాష్ రెడీగా వుంచమని వెళ్ళిపోయాడు.

"ఆ కాష్ రెడీగా వుంచారా?"

"కాష్ హోటల్లో వుంది, రేపు తప్పక యిస్తానని పవన్ అన్నారు."

"హోటల్ గదిలో పవన్‌కుమార్ డబ్బు యెక్కడ దాస్తాడు?"

"ఆయన బ్రీఫ్‌కేసులో వుంటుంది."

"మిస్టర్ వినాయక్, మీరొకసారి వెంటనే యిక్కడకు రండి," అని రిసీవర్ పెట్టేశాను.

గదిలోంచి బయటకు నడిచాను. తలుపుమూసి తాళం వేసుకొని నా జేబులో పడేసుకున్నాను.

గబగబా శవం వున్న గదిలోకి వెళ్ళాను. బీరువా తెరిచి చూశాను. అన్నిచోట్లా వెతికాను. కాని ఎక్కడా బ్రీఫ్‌కేసు లేదు!

"బ్రదర్ దేనికోసం వెతుకుతున్నావు?" అడిగాడు నాయర్.

"లక్షరూపాయలున్న బ్రీఫ్‌కేస్ యీ గదిలో వుండాలి. అది మాయమైంది," అన్నాను.

నాయర్ ఆశ్చర్యంగా నా వైపు చూశాడు.

4

రాజన్‌తో సహా ఆమె నేను వున్న 15 నంబరు గదిలోకి వచ్చింది.

"నా పేరు రాజన్. ఈమె మాలతి," అన్నాడతను.

వాళ్ళిద్దరూ సోఫాల్లో కూర్చున్నారు.

ఎదురుగా నిలబడి యిద్దరివైపూ చూశాను. చదువుకున్న యువతిలా కనిపిస్తోందామె.

"నిన్నరాత్రి అతడి గదికి యెప్పుడు వెళ్ళావు?"

అడిగాను.

"పదింటికి సార్. ఫోన్ చేస్తే ఆయన పైకి రమ్మన్నారు. వెళ్లాను" అందామె.

"అప్పుడు పవన్ కుమార్ ఏం చేస్తున్నాడు?"

"స్కాచ్ విస్కీ తాగుతున్నారు. ఆయన తిండి కూడా సరిగా తినలేదు. అలాగే నిద్రపోయాడు."

"నువ్వు ఎందుకు వెళ్ళిపోయావు?"

"ఆయన కోర్కెలు తీర్చడానికి నేనా గదికి వెళ్ళాను. కాని యే కోరికా లేకుండా ఆయన హాయిగా నిద్రపోయాడు. పొద్దుటదాకా ఆయన లేవడని అనుకున్నాను. మెల్లిగా గదిలోంచి బయటికి నడిచి వెళ్ళిపోయాను," అందామె.

"అప్పుడు టైమెంతయింది?"

"పన్నెండు కావస్తోంది."

"నువ్వు నడవమ్మట వెళ్తూంటే యెవరైనా చూశారా? ...."

"ఎవ్వరూ చూడలేదు సార్," అందామె.

ఆమెవైపు సూటిగా చూశాను.

"పవన్ గదిలో టేబుల్ మీద తోలుపెట్టె వుంది. అక్కడ బ్రీఫ్ కేస్ కూడా వుండాలి...."

"ఉంది. ఆది పెట్టె పక్కనే వుంది. నేను చూశాను."

"ఆ బ్రీఫ్ కేస్ లో ఏముందో చూశావా?"

"లేదు సార్," అందామె.

"నువ్వు ఒంటరిగా యింటికి వెళ్ళావా?"

"కింద నున్న లాంజిలో రాజన్ కనిపించాడు. జరిగింది అతడికి చెప్పి నేను వెళ్ళిపోయాను."

అతడివైపు చూశాను.

"ఆమె చెప్పింది నిజమేసార్," అన్నాడు రాజన్.

రాజన్ సన్నగా, పొడుగ్గా వున్నాడు. నూటు వేసుకొన్నాడు. అతడి మొహం చూసి నీచమైన వృత్తిలో వున్నాడని ఎవరూ అనుకోరు.

"రాజన్, ఆమె వెళ్ళిపోయాక నువ్వు పవన్ గదికి వెళ్ళావా?"

"లేదు సార్."

"అబద్దాలాడి జయించలేవు. పవన్‌కుమార్ గది తలుపుకు తాళం వేయకుండా ఆమె వచ్చేసిందని నీకు తెలుసు. అతడు తప్పతాగి పడున్నాడని నీకు తెలుసు. అతను డబ్బున్నవాడని నీకు బాగా తెలుసు. కష్టపడకుండా, శ్రమించకుండా డబ్బు సంపాదించడం నీకు అలవాటైపోయింది. అతడి గదిలోకి వెళ్ళి వున్నది పట్టుకుని బయట పడొచ్చు. ఎవ్వరూ నిన్ను అనుమానించరు!"

అతడు మొహాన్ని చేతో కప్పేసుకున్నాడు. "పరశురామ్‌గారూ, చాలా నీచమైన పని నేను చేస్తున్నాను. కాని నేను దొంగను కాను. నేను ఆ గదిలోకి వెళ్ళలేదు. మాలతి వెళ్ళిపోయిన ఐదునిమిషాల తర్వాత నేను నా యింటికి వెళ్ళిపోయాను" అన్నాడతను.

"నువ్వు వెళ్ళడం యెవరేనా చూశారా?"

రాజన్ కాస్సేపు ఆలోచించాడు.

"హోటలు గేటుబయట వుండే గూర్ఖా చూశాడు. మరో విషయం. రాత్రి పది తర్వాత యీ హోటల్లో యెవ్వరూ వారి యిష్టమొచ్చినట్లు పైకి వెళ్ళలేరు. లిఫ్టుల దగ్గర మెట్లదగ్గర హోటల్ సెక్యూరిటీ గార్డ్సు పహారు

చేస్తూవుంటారు. ఇక్కడ గదుల్లో వుండేవాళ్ళనే వారు పైకి వెళ్ళనిస్తారు. తతిమ్మావాళ్ళను వెళ్ళనివ్వరు. గదికి ఫోన్ చేసి అనుమతి పొందాక పైకి పంపుతారు. అందుకే మాలతి ఫోన్ చేయించి పైకి వెళ్ళింది. దీన్ని గురించి మేనేజర్ అర్నాల్డ్‌తో మీరు మాట్లాడి కనుక్కోవచ్చు."

"పైనుంచి కిందకు దిగి వెళ్ళిపోయే వాళ్ళను గురించి సెక్యూరిటీ గార్డ్సు అంతగా పట్టించుకోరా." ప్రశ్నించాను.

"కిందికి దిగిపోయే వాళ్ళను గురించి సెక్యూరిటీ గార్డ్సు అంతగా పట్టించుకోరు."

అతడివైపు సూటిగా చూశాను.

"పవన్‌కుమార్ నీకు యెంతకాలంగా తెలుసు?"

"ఐదేళ్ళనుంచి ఆయనతో నాకు పరిచయముంది."

అడ్రెసులు తీసుకుని వాళ్ళిద్దర్నీ వెళ్ళమన్నాను. రాజన్, మాలతి నాకు నమస్కరించి వెళ్ళిపోయారు.

సిగరెట్ పీలుస్తూ ఆలోచిస్తున్నాను. ఈ హత్య ఎందుకోసం జరిగింది? రాజన్ 30 నంబరు గదిలోకి వెళ్ళివుంటే పవన్ నిద్రపోతూ వుండేవాడు. ఆ బ్రీఫ్‌కేసు పట్టుకు పారిపోవడానికి అతడిని చంపవలసిన అవుసరం లేదు. మాలతి వెళ్ళిన సమయంలో, పన్నెండు ప్రాంతంలో, పవన్ నిషాలో నిద్రపోతున్నాడు. గదిలోకి ఎవరొచ్చినా, ఏది పట్టుకుపోయినా గమనించే స్థితిలో అతను లేడు.

రాజన్‌కీ, మాలతికీ ఆ బ్రీఫ్‌కేస్ పట్టుకుపోయే అవకాశం వున్నా పవన్‌కుమార్ని చంపవలసిన అవుసరంలేదు.

తీవ్రంగా ఆలోచిస్తున్నాను.

మేనేజర్ ఆర్నాల్డ్ ఖంగారుగా నా గదిలోకొచ్చాడు.

"పరశురామ్‌గారూ, 30 నంబరు గది కెదురుగా 20 నంబరు గదిలో వుండే వ్యక్తి మాయమయ్యాడు. అతడి పేరు గంగాధర్. మొన్న అతడు ఇక్కడ గది తీసుకున్నాడు. ఇవాళ అతడు బ్రేక్‌ఫాస్టుకి రాలేదు. ఫోన్ చేసే రిసీవర్ ఎత్తలేదు. మా దగ్గరున్న కీతో తలుపు తెరిచి, లోపలకు వెళ్ళి చూశాం. గదిలో అతడి వస్తువులు ఏమీ లేవు. అతడు యెక్కడికో పారిపోయి వుంటాడు" అన్నాడు ఆర్నాల్డ్.

"అతడు మీకు డబ్బు బాకీ వున్నాడా?" ప్రశ్నించాను.

"ఇవ్వాలి!"

నా మెదడులో ఏదో వెలిగింది. ఆర్నాల్డ్‌తో బయటకు వెళ్ళాను. ఇరవై నంబరు గదిముందు నిలబడ్డాను. అది 30 నంబరు గదికి యెదురుగా వుంది!

ఆ గదిలోంచి 30 నంబరు గదిని రహస్యంగా గమనిస్తూ వుండొచ్చు!

ఇరవై నంబరు గదిలోకి వెళ్ళాను. హోటల్ మేనేజర్ ఆర్నాల్డ్, ఇన్‌స్పెక్టర్ నాయర్ నా పక్కనే వున్నారు.

గదంతనీ సోదా చేశాను. టేబుల్ కింద ఒక రమ్ బాటిల్ పడుంది. నాయర్ వైపు తిరిగాను.

"ఆ బాటిల్ మీద యీ గదిలో వున్న వ్యక్తి వేలిముద్రలు వున్నాయేమో చూడమను," అన్నాను.

టీపాయ్‌మీదున్న యాష్ట్రేలోని సిగరెట్ పీకలవైపు

చూశాను. చార్మినార్ ఫిల్టర్ సిగరెట్ పీకలు!

వేగంగా ముప్ఫయి నంబరు గదిలోకి వెళ్ళాను. అక్కడున్న యాష్ట్రేను సోదా చేశాను. గోల్డుఫ్లేక్ సిగరెట్ పీకల మధ్య కొన్ని చార్మినార్ ఫిల్టర్ పీకలున్నాయి.

20 నంబరు గదిలో వున్నతను యీ గదిలోకి వచ్చుండాలి! సందేహం లేదు!

గంగాధర్ యీ గదిలోకి ఎప్పుడు వచ్చాడు? నిన్న రాత్రి మాలతి వెళ్ళిపోయాకా?

మాలతి వెళ్ళడం అతను చూసివుంటాడు. ఆ తర్వాత అతడు 30 నంబరు గదిలోకి వెళ్ళివుండొచ్చు!

నా మెదడులో ఆలోచనలు చకచక సాగిపోతున్నాయి. నడవలో కొచ్చి సిగరెట్ వెలిగించాను. పొగ పీల్చి వదులూ పైకి చూశాను.

తృప్తిపడ్డాను! మేనేజర్ ఆర్నాద్ వైపు చూశాను. అతడు నా దగ్గర కొచ్చాడు.

"గోడపైనున్న టెలిఫోన్ వైర్లను ఎవరో కత్తిరించారు." అన్నాను.

"మీరు చెప్పింది నిజం సార్. అది ఎవ్వరూ గుర్తించలేదు." అన్నాడతను.

30 నంబరు గదిలోకి వెళ్ళి రిసీవర్ ఎత్తాను. నిశ్శబ్దంగా వుంది.

వెనుక నున్న ఆర్నాద్, నాయర్ వైపు చూశాను.

"పవన్‌కుమార్కి ఫోను చేసే అవకాశం లేకుండా హంతకుడు జాగ్రత్తపడ్డాడు." అన్నాడు ఇన్‌స్పెక్టర్ నాయర్.

"నాయర్ భాయ్, అదే విచిత్రంగా వుంది. పవన్‌కుమార్ తప్పతాగి నిద్రపోతున్నాడు. అతడి టెలిఫోన్

వైర్లను హంతకుడు ఎందుకు కట్ చేశాడు?" అన్నాను.

"బ్రదర్, అది నువ్వే కనుక్కోవాలి." అన్నాడు ఇన్‌స్పెక్టర్ నాయర్.

5

అతడు రోడ్డమ్మట నడుస్తున్నాడు. చేతిలో లెదర్ బాగ్ వుంది. పెదిమల మధ్య సిగరెట్ వెల్గుతోంది.

పేవ్‌మెంటమ్మట జనం యిటూ, అటూ కదులుతున్నారు. సాయంత్రం సమయం. అతడు మాటులో వున్నాడు. నీలం రంగు టై, కాళ్ళకు నల్లటి బూట్లు.

పదేళ్ళ కుర్రాడు ఒకచోట నిస్సహాయంగా కూర్చుని ముష్టి అడుక్కుంటున్నాడు. అతడు ఆగాడు. ఆ కుర్రాడి వైపు చూశాడు.

చిరిగిన గుడ్డలు. చింపిరి జుత్తు.

"కడుపులో మాడ్తోంది సార్. పది పైసలివ్వండి," అర్చాడా కుర్రాడు.

"నాతో రా." అన్నాడతను.

"ఎక్కడికి సార్?"

"నీ ఆకలి తీరుస్తాను."

అతడితో సహా ఆ కుర్రాడు నడవసాగాడు.

"నీ పేరు?"

"గోపీ, సార్."

"నీకు దగ్గర చుట్టాలున్నారా?"

"అమ్మ వుంది సార్. మరెవ్వరూ లేరు."

ఇద్దరూ గజపతి హోటల్లోకి వెళ్ళారు.

రెండు కుర్చీల్లో ఎదురెదురుగా కూర్చున్నారు. అతడు కుర్రాడివైపు చూశాడు.

"గోపీ, ఈ రోజు నే నా చెల్లెలు మరణించింది. నా

చెల్లెలు పద్మంటే నా కెంతో ప్రేమ. అమ్మ, నాన్న పోయాక దాన్ని నేనే పెంచాను. ప్రాణంలా చూసు కునేవాడిని. ఆమె జ్ఞాపకార్థం నీకు తిండి పెట్టిస్తాను. నీకు యేం కావాలో అన్నీ తిను! మొహమాట పడకు!" అన్నాడతను.

"ఇదంతా వింటే బాధగా వుంది సార్."

"బాధపడి యేం చెయ్యగలవు! హాయిగా తిని నా చెల్లెలు ఆత్మకు శాంతి చేకూర్చు!"

హోటల్ బాయ్ వచ్చాడు. అతడు పెద్ద పెట్టున ఆర్డరిచ్చాడు. బాయ్ ప్లేట్లను తెచ్చి టేబుల్ మీద పెట్టాడు.

గోపీ ఆకల్తో తింటున్నాడు. వేడి కాఫీ తాగుతూ అతడు గోపీని గమనిస్తున్నాడు.

"ఇవాళ ఎవరి మొహం చూశానో గాని కడుపు బాగా నిండింది, సార్." అన్నాడు గోపీ మూతి తుడుచుకుంటూ.

"నీ తల్లి మొహం చూసుంటావు! తన బిడ్డ క్షేమంగా వుండాలనీ, యే విధంగానూ బాధపడకూడదనీ తల్లి ఎప్పుడూ హృదయంలో అనుకుంటూ వుంటుంది." అన్నాడతను.

"బాగా చెప్పారు, సార్."

హోటల్ బాయ్ రాగానే కొన్ని పదార్థాలు పేర్లు చెప్పి పాక్ చేసి తెమ్మన్నాడు.

ఆ పాకెట్‌ను నవ్వుతూ గోపీ కిచ్చాడు.

"ఎందుకు సార్?" అడిగాడు గోపీ.

"నీ ఆకలి తీరినపుడు నీ తల్లి ఆకల్ని గుర్తుంచుకో! ఈ పాకెట్ ఆమెకు!"

"మీరు దేవుడులాంటివారు సార్."

అతడు సూటిగా గోపీవైపు చూశాడు.

"దేవుడు నీ కప్పుడేనా ఏదేనా యిచ్చాడా? యిలా టిఫిన్ పెట్టించాడా?"

"లేదు, సార్."

"మనకు తెలియని దేవుడితో మనిషిని పోల్చడం మంచిది కాదు. నీకు మంచి చేసేవాడు మంచి మనిషి!"

"అవును, సార్."

అతడు కోటు జేబులోంచి ఒక వంద రూపాయల నోటు తీసి అతడి కిచ్చాడు.

"అది జేబులో దాచుకో. నీ తల్లి కియ్యి."

"ఎవరిచ్చారంటే యేం చెప్పను సార్?"

అతడు నవ్వాడు.

"అన్నయ్య యిచ్చాడని చెప్పు! నీలాంటి వాళ్ళంటే అన్నయ్యకు చాలా ప్రేమని చెప్పు."

ఇద్దరూ హోటల్లోంచి బయటకు నడిచారు. వాళ్ళిద్దరివైపూ కొందరు విచిత్రంగా చూశారు.

"గోపీ, వెళ్ళు." అన్నాడతను, పేవ్ మెంట్ మీదకు రాగానే.

ఇద్దరూ పక్క పక్కనే నడుస్తున్నారు.

"మిమ్మల్ని వదల బుద్ధి కావడంలేదు." అన్నాడు గోపీ దుఃఖంతో.

"గోపీ, వెళ్ళి నీ తల్లి ఆకలిబాధను తగ్గించు!" అన్నాడతను.

గోపీ పేవ్ మెంట్ మీద అలాగే నిలబడి వుండిపోయాడు. అతడు పెంద అంగల్లో నడిచి వెళ్ళిపోయాడు.

అతడి రూపం మాయమవగానే గోపీ వెనక్కి తిరిగి నడవసాగాడు. సైకిల్ రిక్షా స్టేండు దగ్గర ఆగాడు.

"మంచి టిఫిన్, కొంటారా?" అడిగాడు.

నలుగురు రిక్షావాళ్ళు అతడిని చుట్టేశారు. పాకెట్‌ను వాళ్ళ కిచ్చి వాళ్ళిచ్చిన చిల్లర డబ్బుల్ని గోపీ జేబులో వేసుకున్నాడు.

ఈల వేస్తూ తన స్థలంలో మళ్ళా కూర్చున్నాడు.

"ఆకలి సార్! పది పైస లివ్వండి!" అర్చాడు గోపీ యిటూ అటూ వెళ్తూన్న వాళ్ళవైపు చూస్తూ.

6

పవన్‌కుమార్ హత్య జరిగి వారం రోజులు దాటి పోయింది. ఎంత ఆలోచించినా హంతకుడి ఆచూకీ నాకు తెలియడం లేదు.

ఇన్‌స్పెక్టర్ నాయర్‌కి యెదురుగా కూర్చున్నాను. పైన ఫాన్ తిరుగుతోంది. ఇన్‌స్పెక్టర్ నా కేసి విచిత్రంగా చూశాడు.

"బ్రదర్, మా రికార్డ్సులో వేలాది అపరాధుల వేలి ముద్రలు వున్నాయి. ఇరవై నంబరు గదిలో మనకు రమ్ బాటిల్ దొరికింది. దానిమీదున్న వేలిముద్రలను మా రికార్డ్సులో వున్న వేలిముద్రలతో పోల్చి చూశాం." అని ఆగాడు నాయర్.

"ఏం తెలిసింది?"

"రమ్ బాటిల్ మీదున్న వేలిముద్రలు నాగరాజు వేలి ముద్రలను పోలి వున్నాయి."

"నాగరాజు ఎవరు?" అడిగాను.

"అతడో హంతకుడు. రెండేళ్ళ క్రితం మునిరెడ్డి అనే మిల్ అధిపతిని నాగరాజు హత్య చేశాడు. అతడిని పోలీ

సులు అరెస్టు చేశారు. కాని నాగరాజు పారిపోయాడు. అతడికోసం వెతకమని సేలమ్ పోలీసు ఇన్‌స్పెక్టర్ తంగరాజు నాకు ఫోన్ చేశాడు. అతడి ఫోటో కూడా పంపాడు."

"ఆ ఫోటో మీ దగ్గరుందా?"

"పాత ఫైల్సులో వుండొచ్చు. వెతకాలి!"

"నాయర్ భాయ్, వెంటనే వెతకమను!" అన్నాను.

నాయర్ లోపలకు వెళ్ళి కాన్సేపట్లో తిరిగి వచ్చాడు.

"వెతకమన్నాను. బ్రదర్, నాగరాజు ఈ హత్య చేసుంటాడనే నమ్మకం నాకు లేదు. నాగరాజు సేలంలో వుండే వ్యక్తి. పవన్‌కుమార్ మీద అతడికి కసి ఏర్పడే అవకాశం నాకు కనబడ్డంలేదు. అంతేకాదు. నాగరాజు బీదవాడు. లాడర్స్‌గేటు హోటల్లో గది తీసుకుని అతడు వుండడు!"

సిగరెట్ పొగ పీల్చి వదుల్తూ నాయర్ వైపు నవ్వుతూ చూశాను.

"నాయర్ భాయ్, జీవితాంతం మనుషులు ఒకలాగే వుండరు. అనుభవాలనుబట్టి మనుషులు మార్తూ వుంటారు. కొన్ని ఏళ్ళక్రితం ఒకతను బెంగుళూరులో బస్ కండక్టర్‌గా వుండేవాడు. మొన్న ఒక పార్టీలో అదే వ్యక్తి నా పక్క కూర్చున్నాడు—ఇప్పుడతను సూపర్ ఫిలిం స్టార్!"

ఒక కానిస్టేబులు కాఫీ తెచ్చి టేబుల్ మీద పెట్టాడు. ఇద్దరం కప్పులను అందుకున్నాం. కాఫీ తాగేసి కప్పును టేబులుమీద పెట్టాను.

"బ్రదర్, ఇదంతా అగమ్యగోచరంగా వుంది. మనకు ఇంతవరకూ తెలిసినదాన్నిబట్టి ఆలోచిస్తే ఎక్కడా అతు

కొట్టడం లేదు."

"నాయర్ భాయ్, తప్ప తాగి పడున్న మనిషి గదికి వెళ్ళే టెలిఫోన్ వైర్లను ఎందుకు కత్తిరించారు? అదే నా నువ్వ నేది?" ప్రశ్నించాను.

"అది సిల్లీ గా వుంది!"

"నాయర్ భాయ్, హంతకుడు గదిలో కెళ్ళాక పవన్ కుమార్ మేల్కొన్నాడేమో!" ప్రతిరోజూ తాగేవాళ్ళు మధ్యలో లేస్తూవుంటారు."

"బ్రదర్, మరో విషయం. డాక్టర్ రిపోర్టునుబట్టి పవన్ కుమార్ మూడు, నాలుగు మధ్య మరణించి వుండాలి. మాలతి వెళ్ళాక హంతకుడు పవన్ కుమార్ గదిలో ప్రవేశించాడని నువ్వు అన్నావు. 12 ప్రాంతంలో ఆమె వెళ్ళిపోయింది. అప్పటినుంచి మూడుదాకా ఆ గదిలో హంతకుడు ఏం చేస్తూ వుంటాడు?"

ఫక్కున నవ్వాను.

"నాయర్ భాయ్, గదిలో చక్కటి స్కాచ్ విస్కీ వుంది. అది తాగుతూ హంతకుడు కూర్చున్నాడేమో!"

ఇన్స్పెక్టర్ నాయర్ పరిహాసంగా నవ్వాడు.

"హత్య చేయడానికి వచ్చిన వాడు స్కాచ్ విస్కీ తాగుతూ కూర్చుంటాడా?"

"హత్య చేయాలనే ఉద్దేశం అతడికి లేదేమో! తర్వాత కలిందేమో!" అన్నాను.

"బ్రదర్, ఇదంతా అయోమయంగా వుంది."

"నాయర్ భాయ్, డోంట్ బాదర్. సేలమ్ నాగరాజా ఎందుకు మునిరెడ్డిని హత్యచేశాడో తెలిశాక మనకంతా అర్థంకావచ్చు."

ఒక అసిస్టెంట్ మాముందు కొచ్చాడు. ఒక ఫోటోను

ఇన్‌స్పెక్టర్కి ఇచ్చాడు. ఆ ఫోటోను తీసుకుని పరీక్షగా చూశాను.

కుర్చీలోంచి లేచాను. ఫోటోను జేబులో పడేసుకున్నాను.

"నాయర్ భాయ్, లాడర్స్ గేటు లోపలికి వెళ్దాం, పద!" అన్నాను.

"బ్రదర్, నువ్వెళ్ళి కనుక్కో! నాకు నమ్మకంలేదు. అవుసరమైతే నేను వస్తాను."

వేగంగా బయటకు నడిచాను. కూర్చుని కారు తలుపు మూశాను. డాడ్జి కారును శరవేగంగా లాడర్స్ గేటు హోటల్ వైపు పోనిచ్చాను.

కాంపౌండులో కారాపి దిగాను. ముందున్న లాంజి లోకి వెళ్ళాను. మేనేజర్ ఆర్నాడ్ గదిలోకి నడిచాను.

అతడు నా వైపు ఆశ్చర్యంగా చూశాడు.

"కూర్చోండి, సార్."

ఫోటోను తీసి అతడికిచ్చాను. ఆర్నాడ్ దానివైపు చూస్తూ వుండిపోయాడు.

"ఆ వ్యక్తిని మీరెక్కడేనా చూశారా?" అడిగాను.

"చూసినట్లుంది సార్."

"ఎక్కడ?"

"అది గుర్తు రావడం లేదు. కాని యెక్కడో చూశాను."

"జ్ఞాపకం తెచ్చుకోండి" అని వూరుకున్నాను.

లీడింగ్ ప్రశ్నలువేసి అతడినుంచి జవాబులు పొందడం నాకిష్టంలేదు. ఆ మనిషిని అతడు చూసుంటే ఎప్పుడో గుర్తొస్తుంది.

సిగరెట్ వెలిగించి పొగవదుల్తూ గది నలువైపులా

చూశాను. అతడు అమాంతంగా కుర్చీలోంచి పైకెగిరి మళ్ళా కూర్చున్నాడు.

"అతడే సార్ గంగాధర్. రూమ్ నంబర్ 20 లో వున్న మనిషి ఇతనే!"

"అతడిని పోల్చడానికి మీకంత టైము యెందుకు పట్టింది?"

"వేషం మారింది. ఈ ఫోటోలో అతడికి పాపిడి వుంది. గం గా ధ ర్ ది అమెరికన్ క్రాపు. సన్నటి మీసాలు. ఈ ఫోటోలో మీసాలు వెడల్పుగా, గుబురుగా వున్నాయి. ఇక్కడ అతను షర్టులో వున్నాడు. అతడు సూటులో వుండగా నేను చూశాను. కాని ఒక్క విషయం నేను చెప్పగలను. ఈ ఫోటో గంగాధర్ దే" అన్నాడు మేనేజర్ అర్నాద్.

"మీ ఫోను ఉపయోగించవచ్చా?" అడిగాను.

"ప్లీస్" అని అతడు ఒక ఫోన్ను నావైపు తోశాడు. రిసీవర్ని ఎత్తాను. డయిల్ టోన్ వినిపిస్తోంది. "అది నా పెర్సనల్ ఫోన్. కావలసిన నంబరు తిప్పండి" అన్నాడతను.

నంబరు తిప్పాను.

"హలో!, ఇన్స్పెక్టర్ నాయర్!"

"నాయర్ భాయ్, మన పరిశోధన సరైన మార్గంలో వెళ్తోంది. సేలమ్ నాగరాజు, యిరవై నంబరులో వున్న గంగాధర్ ఒక్కడే! హోటల్ మేనేజర్ అర్నాద్ సులువుగా పోల్చాడు."

"గుడ్ గాడ్!" అరిచాడు నాయర్.

"నాయర్ భాయ్, హంతకుడి ఫోటోను నీ ఫైల్సులో వుంచుకుని అతడు ఎవరా అని నువ్వూ నేనూ బుర్రలు

పగలగొట్టుకుంటున్నాం!" అన్నాడు నవ్వుతూ.

"ఇప్పుడు ఏం చేద్దాం?"

"నే నక్కడి కొచ్చి చెప్తాను." అని రిసీవర్ని పెట్టేశాను.

7

వినాయక్ లాడ్జి తండయార్ పేట్ లో మారుమూలన వుంది. ఆ లాడ్జిలో 10 గదులు మాత్రం వున్నాయి. లాడ్జి చిన్నదైనా గదులు శుభ్రంగా వుంటాయి.

అక్కడ వుండేవాళ్ళు నెల నెలా బాడుగ చెల్లించి వుంటూ వుంటారు.

రూం నంబరు పన్నెండు మేడమీదున్న చివరి గది. ఆ గదిలో రెండేళ్ళ నుంచి అతడు వుంటున్నాడు.

గది తీసుకున్నప్పుడు తన పేరు వీరాస్వామి అని చెప్పి పుస్తకంలో సంతకం పెట్టాడు. పొగాకు వ్యాపారంలో వున్నట్లు చెప్పి తన అసలు వూరు గుంటూరని పుస్తకంలో రాయడానికి వివరాలు యిచ్చాడతను.

టైమ్ ఏడు దాటింది. లాడ్జిలోని లైట్లు వెలుగుతున్నాయి. కింద హాల్లో కూర్చుని కొందరు టీ.వీ చూస్తున్నారు. లాడ్జి ప్రొప్రయిటర్ కుమరన్ తన పని చేసుకుంటూ టి.వీ చూస్తున్నాడు.

పన్నెండో నంబరు గదిలో లైటు వెల్గుతోంది. అతను ఓల్డు మోంక్ రమ్ బాటిల్ తెరిచాడు. గ్లాసులో కొంత పోసి థమ్స్ అప్ కలిపాడు. మెల్లిగా తాగుతూ కూర్చున్నాడు.

చార్మినార్ ఫిల్ టర్ సిగరెట్ వెలిగించాడు. బయట యేదో గోల!

గబగబా వెళ్ళి అతడు కిటికీలోంచి బయటకు

చూశాడు. రోడ్డమ్మట పెద్ద కుక్క పరుగెడుతోంది. కర్రలతో, యినుపకడ్డీలతో కొందరు దాని వెనుక పరుగెడుతున్నారు.

"నలుగుర్ని కరిచిందట!" అందో ముసలిది.

"పిచ్చికుక్క!" అన్నాడు ఒకతను.

"పిచ్చికుక్కను చంపాలి!" అన్నాడొకడు.

నవ్వుకుంటూ అతడు కుర్చీలో కూర్చున్నాడు. పిచ్చి కుక్కను చంపాలి! పిచ్చి కుక్కలా ప్రవర్తించే మనుషులను కూడా చంపవలసిందే అనుకున్నాడు తనలో తాను.

గ్లాసులోని రమ్ తాగేసి మళ్ళా పోసుకున్నాడు. రమ్ తాగుతున్నాడు. సిగరెట్లు కాల్చి పీకలను యాష్ట్రేలో పడేస్తున్నాడు.

గదంతా యేదో కలలోని దృశ్యంలా అతడికి కనిపిస్తోంది. అతడింకా తాగుతూనే వున్నాడు.

రమ్, విస్కీ, బ్రాందీ యేదో తాగితే గాని తను జీవించలేడు. కుర్చీలో వెనక్కు వాలి అతడు తన గతాన్ని గురించి ఆలోచించసాగాడు.

గతం! రెండేళ్ళ క్రితం సేలమ్‌లో!

చెట్టియార్ ఆఫీసులో ప్యూన్‌గా పని ముగించుకుని అతడు యింటికొచ్చాడు. అప్పటికే చీకటి పడిపోయింది.

తలుపు తట్టాడు.

"పద్మా!" అని పిల్చాడు.

జవాబు లేదు. గదిలోకి వెళ్ళాడు. గదిలో ఎవ్వరూ లేరు. వంట గది తలుపులు దగ్గరగా మూసి వున్నాయి. తలుపులు తోసి లోపలకు వెళ్ళాడు.

"పద్మా!" అని గావుకేక వేస్తూ ముందుకు పడ్డాడు.

నేలమీద పద్మ మాడిపోయిన మాంసం ముద్దలా పడి

వుంది. అతడి ప్రియమయిన చెల్లెలు పద్మ.

అతడు వెక్కి వెక్కి ఏడ్చాడు. నేలమీద పడున్న కాగితం వైపు చూశాడు.

పద్మ ఆఖరి ఉత్తరం!

"అన్నయ్యా!

మునిరెడ్డి వచ్చి తన కామం తీర్చుకుని వెళ్ళాడు. అతడిని నే నాపలేకపోయాను. బతికుండి నీ మొహం చూడలేను. మరుపురాని నీ ప్రేమను నా ఆత్మలో మిళితం చేసుకుని పోతున్నా.

నీ చెల్లెలు."

అతడు అర్చినా, ఏడ్చినా ఎవ్వరూ రాలేదు. ఊరుకి దూరంగా వుంది ఆ పురాతన యిల్లు.

అతడి కళ్ళు యెర్రబడ్డాయి. పిడికిలి బిగించాడు. నేల మీద మాడి పడున్న ఆకారం వైపు కన్నీళ్ళతో చూశాడు.

"చెల్లీ! వాడి రక్తం తాగుతాను! వాడిని చిత్రవధ చేస్తాను!" అర్చాడతను.

ఆ రాత్రి పదింటికి అతడు రోడ్డు వారగా నిలబడి చూస్తున్నాడు. మునిరెడ్డి పట్నం వెళ్ళాడు. ఈ పాటికి కార్లో వస్తూంటాడు.

కారు హెడ్ లైట్లు దూరంగా కనిపించాయి. తన పక్కనున్న రాళ్ళను అతడు రోడ్డు కడ్డంగా పడేశాడు. కాస్సేపట్లో నల్లటి కారు రాళ్ళ ముందు ఆగింది.

డ్రయివర్ కిందకు దిగాడు. కారు పక్కకు వెళ్ళా డతను.

"ఎవర్రా రాళ్ళు పెట్టింది?" అర్చాడు మునిరెడ్డి.

"నేనురా!" అర్చాడతను.

"నాగరాజా! రా, కారులో కూర్చో! నీ చెల్లెలు యేదో నీతో చెప్పి వుంటుంది. నేనంటే దానికి యిష్టమని తేలిందిలే!"

తలుపు తెరిచి అతడు మునిరెడ్డిని బయటకు లాగాడు. డ్రయివర్ అక్కడి నుండి పారిపోయాడు. "నా చెల్లెలికి నువ్వంటే యెంత యిష్టమో కళ్ళతో చూశానురా రాస్కెల్!" అర్చాడతను.

"నాగరాజా! అయిందేదో అయింది. మనం చెప్పకుంటే గాని యెవ్వరికీ తెలియదు. నీకు ఐదు వేలిస్తాను నన్ను పోనీ!"

"కిరసనాయిల్ మీద పోసుకుని నా చెల్లెలు మాడి పోయిందిరా, నీ కామానికి బలయిపోయింది!"

మునిరెడ్డి వణుకుతున్నాడు. నాగరాజు కత్తి అతడి గుండెలోకి దిగింది. మునిరెడ్డి కోడ్డు వారగా కూలి పోయాడు.

అతడు కసితో మునిరెడ్డిని అనేక చోట్ల పొడిచాడు. రాళ్ళతో అతడి తలను పగులగొట్టాడు. ఇంకా అలా కొడుతూనే వున్నాడు.

కాగడాలతో అనేకమంది మనుషులు అతడిని చుట్టేశారు."

కుర్చీలో కూర్చున్న అతడు ఉలిక్కి పడుతూ లేచాడు. గ్లాసులో రమ్ పోసుకుని థమ్సప్ కలిపి తాగుతూ ఉండిపోయాడు.

అదే సమయంలో టి.వి.లో చూపించిన ఫోటోను చూసి లాడ్జి ప్రొప్రయిటర్ కుమరన్ ఉలిక్కిపడ్డాడు.

"అనేక మారు పేర్లతో యితను వ్యవహరిస్తూ వుంటాడు. వేషం మారుస్తాడు. అమెరికన్ క్రాఫు,

సన్నటి మీసాలు వుండొచ్చు. సూటులో వుండొచ్చు. ఇతడు డేంజరస్ హంతకుడు. ఎక్కడయినా కనిపిస్తే పోలీసు రిపోర్టు యివ్వండి. పట్టిచ్చిన వారికి స్పెషల్ యివార్డుగా ఐదు వేలు యివ్వబడును," అని స్పష్టంగా చెప్పింది టి.వి. అనౌన్సర్.

కుమరన్ వెంటనే ముక్కుపొడుం పీల్చాడు. హాలు నలువైపులా చూశాడు. హాల్లో యెవరూ లేరు.

అతడు డైరెక్టరీ చూశాడు. రిసీవరెత్తి ఒక నంబరు తిప్పాడు. అటు వైపు నుంచి యెవరో "హాలో!" అన్నారు.

"సార్! టి.వి.లో ఫోటో చూపించిన హంతకుడు మా లాడ్జిలో వున్నాడు. వెంటనే రండి," అని చెప్పి వివరాలన్నీ యిచ్చాడు.

8

వినాయక్ లాడ్జి ముందు కారాపి దిగాను. పోలీస్ జీపు వచ్చి ఆగింది. ఇన్స్పెక్టర్ నాయర్, ఆరుగురు కానిస్టేబుల్సు కిందకు దిగారు.

వేగంగా నేనూ, ఇన్స్పెక్టర్ నాయర్ హాల్లోకి వెళ్లాం. లాడ్జి యజమాని కుమరన్ మా వైపు వచ్చి నమస్కరించాడు.

"పైకి రండి!" అన్నాడతను.

మెట్లెక్కి పన్నెండో నంబరు గది ముందుకు వెళ్లాం. తలుపు అటువైపు నుంచి మూసి వుంది.

తలుపును మెల్లిగా తట్టాను.

కాస్సేపట్లో తలుపు తెరవబడింది. తూలుతూ అతడు నా వైపు చూశాడు.

ముందుకు దూకి అతడిని బలంగా పట్టుకున్నాను. ఇన్

స్పెక్టర్ నాయర్, యిద్దరు కానిస్టేబుల్సు లోపల కొచ్చి అతడిని పట్టుకున్నారు.

ఇన్‌స్పెక్టర్ నాయర్ అతడి చేతులకు బేడీలు వేశాడు. అతడు నేలమీద కుప్పలా కూలిపోయాడు.

గదిలో వున్న రమ్ బాటిల్ వైపు చూశాను. "బాగా తాగి వున్నాడు" అన్నాను.

"గదంతా సోదా చేయండి" అర్చాడు నాయర్.

కుమరన్ వినయంగా ఇన్‌స్పెక్టర్ ముందుకు వచ్చాడు.

"ఇతడిని పట్టిచ్చింది నేను సార్. పేరు కుమరన్. ఈ లాడ్జి యజమాన్ని."

"ఐదు వేలు మీ కొస్తుంది" అన్నాడు నాయర్.

నాయర్ నా పక్కనే నడుస్తున్నాడు. కుమరన్ నేలమీద పడున్న వ్యక్తి పక్కనే నిలబడ్డాడు.

అమాంతంగా కుమరన్ అరుపులు గదిలో భయంకరంగా ధ్వనించాయి. కుప్పలా పడున్న అతడు చటుక్కున లేచి కుమరన్ని కాలో గజబలంతో తన్నాడు.

కుమరన్ గాలిలో యెగిరి గోడకు తల కొట్టుకుని రక్తం కక్కుతూ కిందపడ్డాడు.

"ఆ ఐదువేలూ నీకు దక్కవురా!" అర్చాడతను.

పోలీసులు అతడిని చుట్టుముట్టారు. కుమరన్ని కిందకు తీసుకుపోయారు.

అతడి ముందుకు వెళ్ళి నిలబడ్డాను.

"పవన్‌కుమార్ మీద నీ కెందు కంత కసి?" ప్రశ్నించాను.

"అతడు ధనవంతుడు. ధనవంతు లంటే నాకు అసహ్యం. డబ్బుతో ఏదయినా కొనొచ్చని భావిస్తారు.

నా చెల్లెలు శీలం దోచుకున్న ధనవంతుడు ఐదు వేలిచ్చి నా నోరు మూద్దామనుకున్నాడు. ధనవంతుల మీద నా కందుకే తీరని కసి!" అన్నాడతను.

"అతడి బ్రీఫ్ కేసు నువ్వే పట్టుకుపోయావా?"

"అవును."

"అయితే అతడి నెందుకు చంపావు?"

"నా గురించి రిపోర్టివ్వడానికి అతడు ప్రయత్నాలు చేశాడు. రిపోర్టివ్వనని నాకు హామీ యిచ్చాడు. అందుకు చంపవలసి వచ్చింది."

ఇన్ స్పెక్టర్ నాయర్ వైపు చూశాను. "నాయర్ భాయ్, యిటు పైన పనంతా నీది. నే వెళ్తాను, గుడ్ నైట్!" అని బయటకు నడిచాను.

—అయిపోయింది—